• అంతరిక్షం నుంచి 'రామసేతు'



రోదసి నుంచి తీసిన రామసేతు ఫొటో ఇది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన కోపర్నికస్ సెంటినల్-2 శాటిలైట్ ఈ చిత్రాలను తీసింది. రామేశ్వరం నుంచి శ్రీలంకను కలిపే ఈ వారధికి భారత్‌లో చారిత్రకంగా అత్యంత ప్రాధాన్యం ఉన్నది. లంకను చేరుకునేందుకు వానర సైన్యంతో కలిసి శ్రీరాముడు ఈ వారధిని నిర్మించాడని పురాణాలు చెబుతున్నాయి.

# స్వర్గంలో రియల్ ఎస్టేట్

- చదరపు మీటరుకు రూ.8 వేలు ధర
- దేవుడితో కలిసి ఆవాసానికి గ్యారెంటీ
- ప్లాట్లు అమ్ముతున్న స్పానిష్ చర్చి



లండన్, జూన్ 24: మార్స్‌పైనో, చంద్రుడిపై రియల్ ఎస్టేట్ అంటే తెలుసు.. కానీ, స్వర్గంలోనూ రియల్ ఎస్టేట్ నడుస్తున్నదన్న విషయం మీకు తెలుసా? తెలియకపోతే వెంటనే తెలుసుకోండి. వీలైతే వెంటనే ఓ ప్లాట్ కొనేయండి. ఆలస్యం చేస్తే మాత్రం ఆశాభంగం. అవునండీ బాబూ.. స్వర్గంలో రియల్ ఎస్టేట్ నడిపిస్తున్నాడో స్పానిష్ చర్చి పాస్టర్. రేటు ఎంత అని అనుకుంటున్నారు? ఒక చదరపు మీటరుకు రూ.8 వేలు. దీనికి సంబంధించిన బ్రోచర్, ఓ టిక్‌టాక్ ఇన్‌ఫ్లుయెన్సర్ చేసిన వీడియో ప్రస్తుతం ట్రెండింగ్‌గా మారింది. ఇంకా ఆ పాస్టర్ చెప్తున్నాడో తెలుసా.. స్వర్గంలో నివాసం ఉండేందుకు ఇప్పటికే దేవుడితో చర్చలు కూడా పూర్తయ్యాయట. 2017లో ఓసారి దేవుడితో మీటింగ్‌లో ఈ అంశం ప్రస్తావనకు రాగా, రియల్ ఎస్టేట్‌కు దేవుడు అనుమతి కూడా ఇచ్చాడట. దేవుడితో పాటు, దేవుడి ఇంటికి పక్కనే నివాసం ఉండే గ్యారెంటీ కూడా ఉందట. స్వర్గానికి మెట్లు.. మేఘాల మధ్య ఓ ఇల్లు.. భార్యభర్తలు, పిల్లలతో కలిసి ఆ మెట్లు ఎక్కుతూ ఇంటి వైపు వెళ్తున్నట్టు క్రియేట్ చేసిన బ్రోచర్ నెట్టింట్లో వైరల్‌గా మారింది. మరో విషయమండోయ్.. స్వర్గంలో ప్లాట్లు కొనటానికి వీసా, జీపే, యాపిల్‌పే, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, మాస్టర్ కార్డు, మాస్ట్రో కార్డు సదుపాయాలు కూడా ఉన్నాయ్. పైగా ఇన్‌స్టాల్‌మెంట్ సదుపాయం కూడా కల్పించారు. ఆశ్చర్యకర విషయం ఏమిటంటే.. ఈ ఆఫర్ నమ్మి ఎంతోమంది వేల డాలర్లు పోసి జాగాలు కొనేస్తున్నారట. స్వర్గంలో రియల్ ఎస్టేట్ బిజినెస్ ఇదే తొలిసారి కాదు.. 2023లో దక్షిణాఫ్రికాలో ఓ పాస్టర్ కూడా తన ఫాలోవర్ల భూములు, ఆస్తులు అమ్మించి.. స్వర్గంలో జాగా కొనిపించడం గమనార్హం.

## సంక్షిప్త వార్తలు

### • సుప్రీంకోర్టులో కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

న్యూఢిల్లీ, జూన్ 23: మద్యం పాలసీ కేసులో బెయిల్ అంశంపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై తాత్కాలిక స్టే విధించి, తీర్పు రిజర్వ్ చేస్తూ ఢిల్లీ హైకోర్టు తీసుకొన్న నిర్ణయం కొంత అసాధారణంగానే కనిపిస్తున్నదని జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి ధర్మాసనం సోమవారం అభిప్రాయపడింది. అయితే ఈడీ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు వెలువరించిన తర్వాతే.. కేజ్రీవాల్ అప్పీల్‌పై తాము నిర్ణయం తీసుకొంటామని పేర్కొన్నది. కేజ్రీవాల్ పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది. కాగా, కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు బెయిల్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఈడీ వేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు మంగళవారం మధ్యాహ్నం తీర్పు వెలువరించనున్నది.

### • గోధుమ నిల్వలపై కేంద్రం ఆంక్షలు

న్యూఢిల్లీ: దేశంలో గోధుమలు ధరలు పెరగకుండా వాటి నిల్వలపై కేంద్రం ఆంక్షలు విధించింది. వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని కేంద్ర ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా వెల్లడించారు.కొత్తగా అమలులోకి వచ్చిన నిబంధల ప్రకారం రిటైల్ ఔట్‌లెట్లు, పెద్ద చైన్ రిటైలర్లుకు చెందిన వ్యక్తిగత స్టోర్లలో 10 టన్నుల వరకు గోధుమలను నిల్వ చేసుకోవచ్చు. ట్రేడర్లు, హోల్‌సేలర్లు, పెద్ద చైన్ రిటైలర్ల డిపోలలో మూడు వేల టన్నులు, ప్రాసెసర్లు తమ నెలవారీ నిల్వ సామర్థ్యంలో 70 శాతం స్టాక్‌గా ఉంచుకోవచ్చు.

### • రష్యాలో ఉగ్రదాడి..15 మంది మృతి

మాస్కో, జూన్ 24: రష్యాలో ఉగ్రవాదులు దారుణానికి ఒడిగట్టారు. ప్రార్థనా స్థలాలు, చర్చిలు, పోలీసు అధికారులే లక్ష్యంగా చేసుకొని తుపాకీ కాల్పులకు తెగబడ్డారు. ఆదివారం డాగేస్థాన్‌లో సాయుధులైన దుండగులు విచక్షణారహితంగా కాల్పులు జరపటంతో, 15 మంది పోలీసు అధికారులు సహా, సాధారణ పౌరులు, చర్చి ఫాదర్ మరణించారని రాష్ట్ర గవర్నర్ సెర్జీ మిలికోవ్ ఒక ప్రకటన విడుదల చేశారు. డాగెస్తాన్ రాజధాని మఖచికల, డెర్బెంట్ నగరాల్లో చర్చిలు, పోలీస్ పోస్టులపై దుండగులు ఏకకాలంలో దాడులకు దిగినట్టు అధికారులు తెలిపారు. దాడి.. ఉగ్రవాదుల చర్యగా రష్యా తీవ్రవాద వ్యతిరేక కమిటీ పేర్కొన్నది. వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు ఉగ్రవాదుల్ని మట్టుబెట్టేందుకు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాయి. ఆరుగురు ఉగ్రవాదుల్ని హతం చేశాయి.

### • తీస్తాపై తగాదా.. సంప్రదించకపోవడంపై మమత ఫైర్

కోల్‌కతా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీస్తా జలాల పంపిణీ, ఫరక్కా ఒప్పందం గురించి బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనాతో జరిపిన చర్చలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా బంగ్లాదేశ్‌తో ఇటువంటి చర్చలు జరపడాన్ని ఆక్షేపించారు. సోమవారం ఈ మేరకు మోదీకి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా ఏకపక్షంగా చర్చలు జరపడం వాంఛనీయం కాదని, ఆమోదించదగినది కాదని స్పష్టం చేశారు. నీరు చాలా విలువైనదని, ప్రజల జీవనాధారమని తెలిపారు. ఇటువంటి సున్నితమైన విషయాల్లో తాము రాజీ పడబోమన్నారు. తీస్తా, ఫరక్కా జల ఒప్పందాల వల్ల రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని వివరించారు.



## రోమన్ సమాధిలో 2 వేల ఏండ్ల నాటి వైన్

న్యూఢిల్లీ, జూన్ 24: స్పెయిన్‌లోని కర్మోనాలో గల ఒక రోమన్ సమాధిలో 2 వేల ఏండ్ల నాటి పురాతన రెడ్ వైన్‌ను పురావస్తు శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన వైన్‌గా ప్రస్తుతం వరకు ఉన్న క్రీ.శ.4వ శతాబ్దం నాటిదిగా చెప్పున్న వైన్ రికార్డును ఈ రోమన్ వైన్ చేజిక్కించుకుంది. పీహెచ్ విలువ తదితర అనేక రసాయన పరీక్షల అనంతరం తాజాగా కనుగొన్న ఈ పాత వైన్ స్వచ్ఛమైనదేనని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. అయితే ఇది ఏ రకం వైన్ అనేది పరిశీలించడానికి నాటి శాంపిళ్లు ఏవీ లేవని తెలిపారు.పురుషుడి అస్థిపంజరం వైన్‌లో మునిగి ఉందని.. తద్వారా ఆ కాలంలో మహిళలు వైన్ తాగడంపై నిషేధం ఉందని వారు చెప్తున్నారు.

## యూపీఎస్సీ పరీక్షల్లో ఏఐ-సీసీటీవీతో నిఘా

న్యూఢిల్లీ, జూన్ 24: నీట్, నెట్ పరీక్షల్లో అక్రమాలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. ఈనేపథ్యంలో సివిల్స్ పరీక్షలను నిర్వహించే యుపీఎస్సీ కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ రకాల పరీక్షల నిర్వహణలో ఫేసియల్ రికగ్నేషన్, కృత్రిమ మేధ ఆధారిత టెక్నాలజీ కలిగిన 'సీసీటీవీ' నిఘా వ్యవస్థను ఉపయోగించనున్నట్టు తెలిపింది.

# అయ్యో రామా!

**అయోధ్య గర్భ గుడిలో లీకేజీ!**

- చిన్న వర్షానికే కారుతున్న నీరు
- విగ్రహ ప్రతిష్ఠ చోటే లీకేజీ
- డ్రైనేజీ మార్గం లేక అక్కడే నీరు
- ధ్రువీకరించిన ప్రధాన పూజారి
- దర్యాప్తు చేపట్టాలని డిమాండ్





అయోధ్య, జూన్ 24: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్మించిన రామమందిరం ప్రారంభోత్సవం జరుపుకొని సరిగ్గా అర్ధ సంవత్సరం కూడా పూర్తి కాకముందే.. ప్రధాన గర్భాలయంలో నీరు లీకేజీ అవుతుందన్న వార్తలు వస్తున్నాయి. దీనిపై ఆలయ ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్ర దాస్ మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే ఆలయం పైకప్పు నుంచి నీరు కారుతున్నదని చెప్పారు. రామ్‌లల్లా విగ్రహం ప్రతిష్ఠించిన చోటే నీరు లీక్ అవుతున్నదని తెలిపారు. దీంతో ఆలయ నిర్మాణంపై ఆందోళన వ్యక్తమవుతున్నది.

### డ్రైనేజీ మార్గం లేదు!

నీళ్ల లీకేజీ తీవ్రమైన సమస్య అని, పరిష్కారంపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, విచారణ చేపట్టాలని సత్యేంద్ర దాస్ డిమాండ్ చేశారు. నిర్మాణంలో సమస్యలేమిటో తెలుసుకోవడంపై దృష్టి పెట్టాలని, వాటిని 1-2 రోజుల్లో పరిష్కరించాలన్నారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించకుంటే, వర్షాలు పెరిగే కొద్దీ పూజలు చేయడం కష్టతరంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రామ మందిరానికి వాటర్ డ్రైనేజీ మార్గం లేదని, పై నుంచి నీరు లీకేజీ అయిన తర్వాత అవి బలరాముడి విగ్రహం ఉన్న చోటు వద్దకు చేరుకుంటున్నాయని చెప్పారు.

### అప్పటిలోగా అసాధ్యం

మరో ఏడాది వ్యవధిలో అంటే 2025, జూలై నాటికి ఆలయ నిర్మాణం పూర్తి కావడం అసాధ్యమని సత్యేంద్ర దాస్ పేర్కొన్నారు. ఒక వేళ ఆలోగా అయితే మంచిదేనని, అయితే ఇంకా చాలా పని ఉన్నదని తెలిపారు.

### 1800 కోట్లతో ఆలయ నిర్మాణం

ఆయోధ్య ఆలయ ప్రారంభోత్సవాన్ని ఈ ఏడాది జనవరి 22న ఎంతో అర్భాటంగా నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దీన్ని బీజేపీ తన సొంత కార్యక్రమంలా నిర్వహించిందనే విమర్శలు ఉన్నాయి. ప్రధాని మోదీ చేతుల మీదుగా బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగింది. రాజకీయ, సినిమా, పరిశ్రమ, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులకు ఆహ్వానాలతో ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రజలు చూసేందుకు లైవ్ ఏర్పాట్లు కూడా చేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు నేతృత్వంలో చేపట్టిన ఈ రామ మందిర నిర్మాణ అంచనా వ్యయం రూ.1,800 కోట్లుగా ఉన్నది. ఆలయ నిర్మాణం, అనంతర నిర్వహణ కోసం ట్రస్టుకు దాతల నుంచి దాదాపు రూ.3,500 కోట్ల మేర వచ్చాయి.



## మరణ ముప్పును తగ్గించే కాఫీ

న్యూఢిల్లీ: ఎక్కువసేపు అదేపనిగా కూర్చోవడం వల్ల అనారోగ్య సమస్యలు దరిచేరుతాయన్నది అందరికీ తెలిసిన విషయమే. అయితే, ఎక్కువసేపు కూర్చున్నప్పటికీ రోజూ కాఫీ తాగడం వల్ల మరణ ముప్పును తగ్గించుకోవచ్చని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. ఈ విషయంలో కాఫీ ఆశ్చర్యకరమైన ఆయుధంగా పనిచేస్తుందని పరిశోధకులు పేర్కొన్నారు. కాఫీ తాగని వారితో పోలిస్తే ఎక్కువసేపు కూర్చుని ఉన్నప్పటికీ, రోజూ కాఫీ తాగేవారు వివిధ కారణాల వల్ల చనిపోయే ముప్పు తక్కువగా ఉంటుందని వివరించారు. 10 వేలమందిపై జరిపిన అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. నిశ్చల జీవనశైలి కలిగి కాఫీ అలవాటు ఉండేవారిలో హృద్రోగ సమస్యలతో మరణించే ముప్పు తక్కువగా ఉందని పరిశోధకులు తేల్చారు. అలాగే, ఎక్కువసేపు కూర్చుని ఉండి కాఫీ తాగని వారితో పోలిస్తే, రోజుకు 2.5 కప్పుల కంటే ఎక్కువ కాఫీ తాగే వారిలో మొత్తంగా మరణాల ముప్పు తక్కువగా ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయన వివరాలు 'సైన్స్ అలెర్ట్'లో ప్రచురితమయ్యాయి.

## అందాల భామ్మ



టెక్సాస్, జూన్ 24: మిస్ యూనివర్స్, మిస్ వరల్డ్, మిస్ ఇండియా పోటీలంటే తమ అందచందాలతో జిగేలుమనిపించే యువతులు మన కళ్లముందు కదలాడతారు. అయితే అమెరికాలో జరిగిన మిస్ టెక్సాస్ యూఎస్ఏ పోటీలో యువతులతోపాటు 71 ఏండ్ల మరిస్సా టీజో అనే బామ్మ కూడా పాల్గొని రికార్డు సృష్టించారు. హ్యూస్టన్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో 75 మంది పాల్గొన్నారు. ఈ పోటీలో అరియెన్నా విజేతగా నిలిచి అందాల సుందరి కిరీటాన్ని దక్కించుకుంది. లేటు వయసులో అందాల పోటీలో పాల్గొనడంపై టీజో మాట్లాడుతూ.. ఇలాంటి అందాల పోటీల్లో భాగస్వామినవ్వడం ఎంతో సంతోషాన్నిచ్చిందని పేర్కొన్నారు. మహిళలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండడానికి, ఏ వయసులోనైనా అందంగా ఉంటారు అని స్ఫూర్తి నింపడానికే తానీ పోటీల్లో పాల్గొన్నట్టు ఆమె తెలిపారు.

# ముందు రోజే జవాబులు రెడీ

- పీడీఎఫ్ రూపంలో సాల్వర్ ముఠా ఫోన్‌కు వచ్చాయి: బీహార్ పోలీసులు
- నీట్-యూజీ అక్రమాలపై దర్యాప్తు

న్యూఢిల్లీ, పాట్నా, జూన్ 24: నీట్-యూజీ పరీక్ష జరగడానికి ఒక రోజు ముందు మే 4న సాల్వర్ ముఠా సభ్యుడికి సమాధానాలు పీడీఎఫ్ రూపంలో వచ్చిందని బీహార్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు వెల్లడించారు. ఈ ముఠాలో బల్‌దేవ్ కుమార్ ప్రధానమైన వ్యక్తి అని.. సంజీవ్ కుమార్ పాత్ర కూడా పెద్దదేనని తెలిపారు. పీడీఎఫ్‌లో ఉన్న సమాధానాలను ఒక స్కూల్‌లోని వై-ఫై ప్రింటర్ ద్వారా ప్రింట్ తీసుకొని వాటిని కొందరు విద్యార్థులకు ఇచ్చి సమాధానాలు బట్టీ పట్టించారని వెల్లడించారు. విద్యార్థులు ఒక బాలుర వసతి గృహంలో, ప్లే స్కూల్‌లో ఈ సమాధానాలను బట్టీ పట్టాక దాదాపుగా వాటిని కాల్చేశారని.. అయితే వాటి అవశేషాలను సేకరించడం ద్వారా సాల్వర్ ముఠా అక్రమాలు కనిపెట్టగలిగామని పోలీసులు తెలిపారు. ఈ వివరాలన్నీ సీబీఐకి అప్పగించినట్టు వారు తెలిపారు. నీట్‌ను రద్దు చేసి పాత పద్ధతిలో వైద్య విద్య ప్రవేశాల పరీక్షలను రాష్ట్రాలే నిర్వహించేలా చేయాలని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రధాని మోదీని కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె ఆయనకు ఒక లేఖ రాశారు.

### పార్లమెంట్ ముట్టడికి విద్యార్థుల యత్నం

నీట్-యూజీ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ సభ్యులు కొందరు సోమవారం పార్లమెంట్ ముట్టడికి ప్రయత్నించారు. 'ఛాత్రా సంసద్ ఘెరావ్' పేరిట వారు చేపట్టిన మార్చ్‌ను పోలీసులు వెంటనే అడ్డుకొని ఆందోళనకారులను వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

**పరీక్ష కోసం 600 కిలోమీటర్లు**

ఈ నెల 23న నిర్వహించాల్సిన నీట్-పీజీ పరీక్షను 12 గంటల ముందు వాయిదా వేయడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది విద్యార్థులను వేధించడమేనని సునంద పన్సారీ అనే విద్యార్థిని విమర్శించింది. తాను పరీక్షకు హాజరవడం కోసం 600 కిలోమీటర్లు ప్రయాణించానని తెలిపింది. పన్సారీ వ్యాఖ్యలపై ఒక నెటిజన్ స్పందిస్తూ.. ఈ దేశంలో పోటీ పరీక్షలు ఒక జోక్‌లాగా మారిపోయాయని అన్నారు. మంచి వైద్యులందరినీ దేశం విడిచి వెళ్లేలా చేసేందుకు ఈ తరహా లీకేజీ పరీక్షల విధానం అవసరమని మరొక విద్యార్థిని విమర్శించింది.



సునంద

## నీట్ ఓఎంఆర్ షీట్ల తారుమారు!

> మొదటిపేజీ తరువాయి...

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే ఇదే తరహా పిటిషన్‌ను హైకోర్టులో ఉపసంహరించుకున్న తర్వాత నీట్‌కు సంబంధించిన అన్ని పిటిషన్లను కలిపి జూలై 8న విచారణ చేస్తామని సుప్రీంకోర్టు పిటిషన్‌దారుకు తెలిపింది. ఇంకోవైపు పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో నీట్-పీజీ పరీక్ష రద్దుపై స్పందించాలని రాజస్థాన్ హైకోర్టు సోమవారం కేంద్రానికి, ఎన్టీఏకు నోటీసులు జారీ చేసింది. పరీక్షను రద్దు చేయాలని పిటిషన్లు కోరారు. దీన్నిపై జస్టిస్ అశోక్‌కుమార్ జైన్ స్పందిస్తూ జూలై 10న విచారణ చేపడతామన్నారు.

## యాంటీ పేపర్ లీక్ నిబంధనలు నోటిపై

దేశవ్యాప్తంగా జరిగే పబ్లిక్ పరీక్షలు, కామన్ ఎంట్రెన్స్ టెస్టుల్లో అక్రమాలు నిరోధించే లక్ష్యంతో తీసుకొచ్చిన 'ద పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్, 2024' నిబంధనలను కేంద్రం నోటిఫై చేసింది. ఈ చట్టం కింద పేపర్ లీక్ కారకులకు 5 నుంచి 10 ఏండ్ల వరకు జైలు శిక్ష, కోటి రూపాయల వరకు జరిమానా విధించే వీలుంది. కంప్యూటర్ ఆధారిత టెస్టులు సహా మిగతా పరీక్షలన్నింటికీ నిబంధనలు, ప్రమాణాలు, మార్గదర్శకాల్ని రూపొందించే బాధ్యతను 'నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ'కి అప్పగించింది.

# అమెరికాకు ఫేక్ బ్రాండ్లతో వెళ్తే జైలుకే!

- పూమా, నైకీ వంటి నకిలీ వస్తువులతో అధికంగా వెళ్తున్న భారతీయులు
- కస్టమ్స్ తనిఖీల్లో చిక్కి తంటాలు
- సీజ్ అయిన వస్తువులు చెత్తలోకి
- ప్రశ్నిస్తే జైలుకు పంపుతామని వార్నింగ్




న్యూఢిల్లీ, జూన్ 24: నేడు మార్కెట్లో ఎక్కడ చూసినా బట్టలు, బ్యాగుల నుంచి ఎలక్ట్రానిక్ వస్తువులు, షూలు, వాటి సాక్సుల వరకు పూమా, అడిడాస్, నైకీ వంటి బడా బ్రాండ్ల పేరుతో నకిలీ ప్రొడక్టులు విపరీతంగా దర్శనమిస్తుంటాయి. మన దేశంలో స్వల్ప మార్పులతో ఇలాంటి ఫేక్ బ్రాండ్ వస్తువులను అమ్మడం లేదా కొనడం సాధారణంగా చూస్తుంటాం. అయితే ఇలాంటి నకిలీ బ్రాండ్ వస్తువులను అమెరికా తీసుకెళ్లాలనుకొంటే మాత్రం ఇబ్బందులు తప్పవు. తాము వాడుకొనేందుకు తెచ్చుకొన్నామని మొత్తుకున్నా.. అమెరికా కస్టమ్స్ అధికారులు విమానాశ్రయాల్లోనే తనిఖీల్లో భాగంగా చెత్తబుట్టలో పడేస్తున్నారు. ఎక్కువగా మాట్లాడినా, వాదించినా కేసు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరిస్తున్నారు. ఇటీవలి కాలంలో భారత్‌కు చెందిన పలువురికి ఇలాంటి పరిస్థితి ఎదురైందని టైమ్స్ ఆఫ్ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది.

### విమానాశ్రయాలు, పోర్టుల్లో నిఘా

అమెరికాలో నకిలీ వస్తువులు ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్(ఐపీఆర్) నిబంధనలకు విరుద్ధం. ఫేక్ వస్తువులతో దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం వస్తున్న నేపథ్యంలో అక్కడి కస్టమ్స్ అధికారులు కఠిన చర్యలు తీసుకొంటున్నారు. ఆ దేశంలో గత ఏడాది 19,724 షిప్‌మెంట్‌ల నుంచి 2.3 కోట్ల ఫేక్ బ్రాండ్ వస్తువులను స్వాధీనం చేసుకొన్నారు. దీంతో అమెరికా అధికారులు నకిలీ వస్తువుల స్మగ్లింగ్‌పై నిఘా పెంచారు. విమానాశ్రయాల్లో, సముద్రాల్లోని పోర్టు ప్రవేశాల వద్ద తనిఖీలు పెంచారు. ఈ తనిఖీల్లో ఎక్కువగా పెద్ద బ్రాండ్ పేర్లతో బట్టలు, హ్యాండ్ బ్యాగులు, బూట్లు, సాక్సులు, ఎలక్ట్రానిక్ వస్తువుల వంటి నకిలీ వస్తువులను తీసుకెళ్తున్న భారతీయ విద్యార్థులు, ప్రయాణికులే ఎక్కువగా పట్టుబడుతున్నారని టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక వెల్లడించింది. అయితే అవి అమ్మేందుకు కాదని, తాము వాడుకోవడానికి అని ఎంత చెప్పినా అధికారులు వినిపించుకోవడం లేదు. వాటిని స్వాధీనం చేసుకొంటున్నారు. ప్రశ్నించిన వాళ్లను.. కేసు నమోదు చేసి, జైల్లో పెడుతామని హెచ్చరిస్తున్నారని రిపోర్టు పేర్కొన్నది.

# సరగసీతో పిల్లలను పొందినా 6 నెలలు సెలవులు

### నిబంధనలను సవరించిన కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 24: అద్దె గర్భం (సరగసీ) ద్వారా సంతానాన్ని పొందిన ప్రభుత్వ మహిళా ఉద్యోగులు ఇకపై 180 రోజులపాటు మాతృత్వ సెలవులు పొందవచ్చు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (లీవ్) రూల్స్-1972లో సవరణలు చేసింది. సరగసీ కోసం గర్భాన్ని అద్దెకిచ్చిన మహిళ కూడా ప్రభుత్వ ఉద్యోగి అయితే ఆమెకూ ప్రసూతి సెలవులు లభిస్తాయి. సరగసీ ద్వారా సంతానాన్ని పొందిన తండ్రి (కమిషనింగ్ ఫాదర్) కూడా బిడ్డ పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల్లో 15 రోజులు పితృత్వ సెలవులు పొందేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. ఇద్దరు బిడ్డలను పొందే వరకే ఈ సెలవులు లభిస్తాయి. సరగసీ ద్వారా సంతానాన్ని పొందిన ప్రభుత్వ ఉద్యోగినికి ఇంత కాలం ఈ సదుపాయం అందుబాటులో లేదు. ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం.. ఉద్యోగిని, ఒంటరి ఉద్యోగి తన పూర్తి సర్వీసు కాలంలో పిల్లల సంరక్షణ కోసం గరిష్ఠంగా 730 రోజులు సెలవులు పొందేందుకు వీలున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 52 ఏండ్లనాటి నిబంధనలను సవరించింది. కొత్త నిబంధనలను ఈ నెల 18న నోటిఫై చేసింది.




## కేరళ కాదు..'కేరళం'

### రాష్ట్రం పేరు మార్చాలని అసెంబ్లీలో తీర్మానం

తిరువనంతపురం: కేరళ రాష్ట్రం పేరు మార్పు మరోమారు తెరపైకి వచ్చింది. కేరళ పేరును 'కేరళం'గా మార్చాలని ప్రతిపాదిస్తూ ఆ రాష్ట్ర శాసనసభ సోమవారం ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రం పేరును 'కేరళం'గా సవరించాలి. 8వ షెడ్యూల్‌లోని భాషలు సహా అన్ని భాషల్లోనూ 'కేరళం'గా పేరు మార్చడానికి కేంద్రం తక్షణమే చర్యలు చేపట్టాలి' అని సీఎం విజయన్ చెప్పారు. రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలని ఎల్డీఎఫ్ సర్కార్ 2023లోనూ తీర్మానం చేయగా, కేంద్రం సాంకేతిక కారణాల్ని చూపుతూ అభ్యంతరం తెలిపింది. మలయాళ ఉచ్చారణ ప్రకారం రాష్ట్రం పేరు 'కేరళం' అవుతుందని విజయన్ అన్నారు.

## బీజేడీ హయాంలో నాపై హత్యాయత్నం: ఒడిశా సీఎం

కియోంఝర్: ఒడిశాలో బీజేడీ పాలనా కాలంలో తనపై బాంబులు వేసి, హత్య చేసేందుకు ప్రయత్నం జరిగిందని ముఖ్యమంత్రి, బీజేపీ నేత మోహన్ చరణ్ మాఝీ సోమవారం ఆరోపించారు. తన సొంత జిల్లా కియోంఝర్‌లోని ఝుంపురలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన ఈ ఆరోపణ చేశారు. మండువలో బాంబు దాడి చేసి, తనను హత్య చేసేందుకు ప్రయత్నించారని, అయితే భగవంతుని ఆశీర్వాదాలు, ప్రజల ప్రేమాభిమానాలు తనను కాపాడాయని చెప్పారు.

## ఐబీ చీఫ్ పదవీకాలం పొడిగింపు

న్యూఢిల్లీ : ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) చీఫ్ తపన్‌కుమార్ డికా పదవీ కాలాన్ని కేంద్రం 2025 జూన్ వరకు పొడిగించింది. ఈమేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. తపన్ కుమార్ హిమాచల్ ప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐపీఎస్ అధికారి.

# మందులూ నాసిరకమే!

- జాబితాలో పారాసిటమాల్, విటమిన్, కాల్షియం ట్యాబ్లెట్లు
- సీడీఎస్సీవో పరిశీలనలో వెల్లడి



(స్పెషల్ టాస్క్ బ్యూరో)


హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం కల్తీ అయినట్టే, జబ్బుపడితే కోలుకోవడానికి వాడే మందులు కూడా నాసిరకాలుగానే ఉన్నాయని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్సీవో) పేర్కొంది. దేశవ్యాప్తంగా తయారవుతున్న ఔషధాల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదని తెలిపింది. ప్రాణాలను కాపాడే 50కి పైగా ఔషధాలు నాసిరకంగా ఉన్నట్టు వెల్లడించింది. ఈ జాబితాలో సాధారణ జ్వరం, ఒళ్లు నొప్పులకు వాడే పారాసిటమాల్ 500 ఎంజీ, రక్తపోటును నియంత్రించే టెల్మిసార్టన్, దగ్గు సిరప్ కఫ్టిన్, నొప్పి నివారణకు వాడే డిక్లోఫెనాక్, మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లు, కాల్షియమ్ గోలీలు ఉన్నట్టు వివరించింది. నాసిరకం ఔషధాల్లో 22కు పైగా మందులు హిమాచల్ ప్రదేశ్‌లోని ఫార్మా కంపెనీల్లోనే తయారవుతున్నట్టు గుర్తించింది. దీంతో ఆ రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి బాధ్యులైన ఫార్మా కంపెనీ ప్రతినిధులకు నోటీసులు జారీ చేసింది. నాణ్యత లేని ఔషధాలను వెంటనే మార్కెట్ నుంచి ఉపసంహరించుకోవాలని ఆదేశించింది.

### సర్వే ఈ ప్రాంతాల నుంచి

గుజరాత్‌లోని వఘోడియా, హిమాచల్‌లోని సోలాన్, రాజస్థాన్‌లోని జైపూర్, ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌తో పాటు అంబాలా, ఇండోర్, హైదరాబాద్‌లోని ఫార్మా కంపెనీల్లో తయారయ్యే మందుల నమూనాలను సేకరించిన సీడీఎస్సీవో అధికారులు వాటిని ల్యాబ్‌లో పరీక్షించి ఈ మేరకు రిపోర్ట్‌ను వెల్లడించారు. కాగా దేశంలో ఉత్పత్తయ్యే ప్రతీ మూడు ఔషధాల్లో ఒకటి హిమాచల్‌లోనే తయారవుతుంది.

# ఎమర్జెన్సీపై వాగ్యుద్ధం

- వాడీవేడిగా మొదలైన లోక్‌సభ సమావేశాలు
- మొదటి రోజున ఎంపీలుగా సభ్యుల ప్రమాణం
- రేపు లోక్‌సభ కొత్త స్పీకర్ ఎన్నిక



సభ ఎదుట 'రాజ్యాంగం'తో విపక్ష ఎంపీలు

న్యూఢిల్లీ, జూన్ 24: లోక్‌సభ సమావేశాలు వాడీవేడిగా మొదలయ్యాయి. ఎమర్జెన్సీపై అధికార విపక్షాల నడుమ వాగ్యుద్ధం నడిచింది. ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఓ మచ్చ అని ప్రధాని మోదీ విమర్శించగా.. గత పదేండ్లలో దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తున్నదని ప్రతిపక్ష కాంగ్రెస్ ధ్వజమెత్తింది. సభ ఉదయం 11 గంటలకు ప్రారంభమైన తర్వాత ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ఎంపీల చేత లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారాన్ని ప్రారంభించారు. తొలుత ప్రధాన మంత్రి, సభా నాయకుడు నరేంద్ర మోదీ, ఆ తర్వాత క్యాబినెట్ మంత్రులు వరుసగా ఎంపీలుగా ప్రమాణం చేశారు. ఎంపీగా ప్రధాని మోదీ ప్రమాణం చేసే సమయంలో విపక్ష పార్టీల సభ్యులు రాజ్యాంగం పుస్తకాలు చేతిలో పట్టుకొని నిలబడ్డారు.తొలిరోజు 262 మంది సభ్యులు ప్రమాణం చేయగా, మిగిలిన సభ్యులు మంగళవారం చేయనున్నారు. కాగా, అంతకుముందు ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్ చేత రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించారు.

### ఎమర్జెన్సీ.. అప్రకటిత ఎమర్జెన్సీ

లోక్‌సభ తొలి సమావేశాల నేపథ్యంలో మొదటి రోజున అధికార, విపక్ష పార్టీల మధ్య 'ఎమర్జెన్సీ' అంశం కీలక టాపిక్‌గా మారింది. సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని మోదీ మీడియాతో మాట్లాడారు. ఇందిరా గాంధీ హయాంలో దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటితో(జూన్ 25) 50 ఏండ్లు అవుతున్న నేపథ్యంలో ఆయన ఆ అంశాన్ని ప్రస్తావించారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో అదొక మచ్చ అని అన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి, దేశాన్ని జైలుగా మార్చారని విమర్శించారు. దీనిపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్పందించారు. 50 ఏండ్ల క్రితం నాటి ఎమర్జెన్సీని గుర్తుచేస్తున్న ప్రధాని.. గత పదేండ్లుగా దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని నడుపుతున్నారనే విషయాన్ని మర్చిపోయినట్టున్నారని విమర్శించారు.

### 'నీట్'పై కేంద్రం సమాధానం చెప్పాల్సిందే

నీట్ పరీక్ష లీకేజీ, అక్రమాల అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తుతామని విపక్ష ఎంపీలు పేర్కొన్నారు. విద్యార్థుల కష్టాన్ని కేంద్రం పట్టించుకోవడం లేదని, తాజా పరిణామాల నేపథ్యంలో పరీక్షల వ్యవస్థ విశ్వసనీయతపై ప్రశ్నలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### రాజ్యసభ సభానాయకుడిగా జేపీ నడ్డా

బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా రాజ్యసభలో సభా నాయకుడిగా ఎన్నికయ్యారు. సోమవారం దిగువ సభలో ప్రమాణ స్వీకారం చేసిన నడ్డా గతంలో ఉన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్థానంలో రాజ్యసభ సభా నేతగా వ్యవహరిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. కాగా, రాజ్యసభ విపక్ష నేతగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వ్యవహరిస్తున్నారు. రాజ్యసభలో నడ్డాతో పాటు 11 మంది కేంద్ర మంత్రులు కూడా సభ్యులుగా ఉన్నారు.

## బీజేపీకి ఇక మద్దతిచ్చేది లేదు: బీజేడీ

భువనేశ్వర్, జూన్ 24: కేంద్రంలో బీజేపీకి ఇకపై మద్దతిచ్చే ప్రసక్తే లేదని బీజూ జనతాదళ్ (బీజేడీ) అధ్యక్షుడు, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ స్పష్టం చేశారు. ఆయన సోమవారం పార్టీకి చెందిన తొమ్మిది మంది రాజ్యసభ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రాజ్యసభలో బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని పట్నాయక్ ఈ సందర్భంగా ఎంపీలకు సూచించారు.